# పెంపెలి

గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది – హ్యాండ్ బ్యాగ్ చంకన తగిలించుకొని హడావిడిగా బయలుదేరిన విదితకు గుమ్మంలోనే ఎదురయ్యాడు వినయ్.

"అదేం విదితా! అప్పుడే బయలుదేరావ్? టైమయిందా!"

"అదిగో... ఆ గడియారం వైపు చూడండి. అది సరే...! టేబుల్‌మీద పప్పుగిన్నె ప్రక్కనే వేయించిన అప్పడాల డబ్బా పెట్టాను చూడండి. పెరుగు పన్నెండు గంటలకుగానీ తోడుకోదు. ఈలోగా దాన్ని కదిలించకండి. నే వస్తా... అంటూ అప్పగింతలు పెట్టి బస్‌స్టాండ్ వైపు బయలుదేరింది. దారిలో ట్రాఫిక్, ఎలక్షన్ల హడావిడి... అన్నింటినీ తప్పించుకొని ఆఫీసుకు వెళ్లేసరికి పదినిమిషాలు ఆలస్యం! మేనేజర్ రూమ్‌కి వెళ్లి సంజాయిషీ చెప్పుకుని, సంతకం చేసి వచ్చి తన సీటులో కూర్చుంది.

'పదినిమిషాల ఆలస్యానికి అతగాడు మొహం మాడ్చుకోవాలా? ఛీ! ఏం ఉద్యోగమో ఏమో! పనిచూస్తే విపరీతం. ఉదయం నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ వంచిన తల ఎత్తకుండా కంప్యూటర్ ఆపరేట్ చేస్తూనే ఉండాలి! ఇంతా చేస్తే నెలకు మూడు వేలు జీతం! హైదరాబాద్ వంటి మహాపట్నంలో ఇద్దరూ ఉద్యోగం చేయకపోతే ఆర్థికమాంద్యంతో మధనపడాలి'. ఆలోచన్లను అదుపులో పెట్టి తన పనిలో నిమగ్నమయింది విదిత.

*   *   *

ఇంటికి వచ్చిన వినయ్ కాఫీతాగి, స్నానం చేసి, పేపరు తీసుకొని కుర్చీలో కూర్చున్నాడు. పేపర్లో అన్నీ రాజకీయ పాఠాలే – అవకాశం దొరికితే చాలు... ఒకరిమీద మరొకరు విమర్శనాస్త్రాలు. రాసిందే రాయడం, చెప్పింది చెయ్యలేకపోవడం... పేపరు చదవాలంటేనే విసుగ్గా ఉంది.

"అయ్యగారూ! కాస్త లేస్తారా! ఇల్లూడుస్తాను" అంటూ పనిమనిషి పాపమ్మ వచ్చింది. వినయ్ లేచి వంటింట్లోకి నడిచాడు... కాసిన్ని మంచి నీళ్లు తాగి అలా వరండాలో నిలబడ్డాడు. మూడేళ్ల ముద్దులొలికే పాపను తీసుకొని ఎదురింటి ప్రతాప్ బయటకు వెళ్తూ రోడ్డుమీద ఆగాడు. "నానా! అంకుల్!" అంటూ వినయ్‌వైపు చేయిచాచి చూపించింది పింకీ! ఇలా రామ్మా! నీకు చాక్‌లెట్ ఇస్తాను. అంటూ దగ్గరగావెళ్లి పాపను ఎత్తుకొన్నాడు. "ఇంట్లోకి రండి సార్! కాసేపు కబుర్లాడుకుందాం" అంటూ లోపలకు వెళ్లి ఓ బిస్కట్ ప్యాకెట్ తెచ్చి పాప చేతిలో పెట్టాడు.

"అంకుల్! కీమ్ బిత్తత్తేనా!" వినయ్ కళ్లల్లోకి చూస్తూ అమాయకంగా అడిగిన పింకీని ముద్దు పెట్టుకున్నాడు వినయ్.

ప్రతాప్‌గారూ! ఈరోజు ఆఫీసుకు వెళ్లలేదా! అడిగాడు వినయ్.

"ఇంకా గంటన్నర టైముందండీ! ఉదయం పదకొండు గంటలకు వెళ్తే సరిపోతుంది". కాసేపు మాట్లాడాక పాపను తీసుకొని బజారుకు వెళ్లాడు ప్రతాప్.


'నువ్వెంతైనా అదృష్టవంతుడివయ్యా ప్రతాప్! నీకు వెనకా ముందూ పెద్దలు సంపాదించిన ఆస్తులున్నాయి. నీ భార్య పెద్ద చదువు చదివినా ఇల్లు చక్కదిద్దుకొనే ఇల్లాలుగానే ఉండిపోయింది'.

'ఆ పాప ఎంత ముద్దుగా ఉంది... ముద్దు ముద్దు మాటలు వింటూ ఆ పాపను చూస్తుంటే తనింట్లోనూ ఓ పాప ఉంటే ఎంత బాగుంటుంద'ని పిస్తోంది. ఆలోచలు అలలు అలలుగా అతని మెద దుని తొలిచేస్తున్నాయి. పెళ్లయి ఆరేళ్లవుతున్నా తమకా అదృష్టం లేదు.

ఇంతలో ఫోన్ మోగింది. లోపలకు వెళ్లి రిసీవర్ అందుకొన్నాడు వినయ్. "విదిత!"... "ఏమండీ! ఈరోజు స్టాఫ్‌మీటింగ్ ఉంది. నేను వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. తాళంచెవి ఇంట్లోపెట్టి మర్చిపోయి వచ్చేసాను. మీరు ఆఫీసుకు వెళ్లేప్పుడు ఎదురింట్లో ఇచ్చివెళ్లండి" అంటూ హుకుం జారీ చేసింది. మళ్లీ ఆలోచనల్లో పడ్డాడు వినయ్! "నేను డ్యూటీకి వెళ్లడం, ఆమె ఇంటికి రావడం... ఆమె డ్యూటీకి వెళ్లడం... నేను రావడం - బాగుంది... ఈ ఉద్యోగపర్వం!" అనుకుంటూ ఓ నిట్టూర్పు విడిచాడు.

* * *

మీటింగ్ హాల్లో అందరూ సమావేశమయ్యారు. తన తోటి ఉద్యోగిని



**కోకా విమలకుమారి**

ఉష ఓ ఫొటోని ప్రక్కనున్న వారికి చూపిస్తూ విదితకూ చూపించింది.

"ఉషా! మీ బాబు చక్కగా ఉన్నాడు. వయసెంత?" అడిగింది విదిత.

"రెండేళ్లండీ... వాడి మాటలు వింటూంటే మాకెంతో కాలక్షేపం!"

"ఉషా! మీరిద్దరూ ఆఫీసుకు వెళ్తే బాబునెవరు చూస్తారు? సందేహాన్ని వెలిబుచ్చింది విదిత".

"మా అమ్మ! మా చింటూ కోసం మా దగ్గరే ఉంటారు. నేను ఇంటికి వేళ్లేసరికి వాడి మాటలు, అల్లరి గురించి అమ్మ చెబుతూంటే నాకు నవ్వాగదనుకో. సంతోషంగా చెప్ప సాగింది..." ఇంతలో ఉపన్యాసం మొదలయింది.

ఉష మాటలు విన్న విదిత మనసులో ఓ మెరుపులాంటి ఆలోచన మెరిసి మాయమయింది. మీటింగు పూర్తయ్యేసరికి సాయంత్రం ఆరుగంటలయింది. సరిగ్గా వినయ్ ఆఫీసుకు బయలుదేరే టైమ్ అది. బ్రతుకుజీవుడా అంటూ బస్సుపట్టుకొని ఇల్లు చేరేసరికి ఏడుగంటలు. స్నానంచేసి ఫ్రెష్ అయి ఫ్రిజ్‌లో కూరతీసి బయటపెట్టింది. కొంచెం బియ్యం పొయ్యిమీద పెట్టింది. అన్నంతిని పేపరు చేతిలోకి తీసుకొంది. కానీ చదవలేకపోతున్నది. కళ్లు మూతలు పడ్తున్నాయి... లైటార్పేసి నిద్రపోయింది. ప్రతిరోజూ ఇదే వారిద్దరి దినచర్య.

* * *


ఆ రోజు ఆదివారం. విదితా! ఈరోజైనా కాస్త నోటికి రుచిగా కూరేదైనా చేయకూడదూ! కాఫీ తాగుతూ అర్థింపుగా అడిగాడు వినయ్.

అబ్బ! అదేమిటండీ! ఈ రోజు హొటల్‌కి వెళ్లి భోంచేసి ఇంట్లో రెస్ట్ తీసుకొందామను కొన్నాం కదా!

"నువ్వలా అంటే ఇంక నేనేమంటాను చెప్పు. పనిమనిషి చేత బట్టలు ఉతికించి స్నానం చేసి చక్కగా ముస్తాబయింది విదిత. భోజనాలయి ఇంటికి వచ్చాక టీవీ ఆన్ చేసింది. జాన్సన్ సోప్ యాడ్‌లో పాలబుగ్గల చంటిబిడ్డని చూడగానే వినయ్ మనసులో ఆందోళన... "విదితా! ఆ బాబు చూడు! ఎంత ముద్దుగా ఉన్నాడో! మనింట్లోనూ ఓ పాపో బాబో ఉంటే ఎంత బాగుంటుంది... ఏమంటావ్!"

నేనేమంటానండీ! నాకు మాత్రం పిల్లలు కావాలనే కోరిక లేదా? ఈ గ్లోబలైజేషన్ ప్రభావమేమోగాని ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో మనం కలిసి మనసారా మాట్లాడుకోవడానికే టైమ్ లేదు. ఇంక పిల్లల్ని కనడం కూడానా ఖర్మ! కన్నా పెంచేదెవరు? మీ అమ్మగారు ఎప్పుడో పోయారు. మా అమ్మ జబ్బుమనిషి... ఆమెకే ఒకరు చేయాలి! మొన్నటికి మొన్న ఆదివారం కదా అని సరదాగా సినిమాకెళ్లి హొటల్‌లో భోజనంచేసి ఇంట్లో రెస్టుగా ఉండాలనుకొంటే ఏమయింది? మీ మేనమామ ఊడిపడ్డాడు. ఆయనకు వంటా వార్పు వగైరా మర్యాదలు చేసేసరికి నా పనైపోయింది.

"సరే! నాకు నిద్రొస్తోంది... వెళ్లి పడుకొంటాను. బెడ్‌రూమ్‌లోకి వెళ్లగానే ఫోన్ మోగింది. రిసీవర్ తీసుకొంది "హలో! నేనక్కా! ఉదయ్‌ని. అమ్మకు బాగోలేదు ఆయాసం ఎక్కువయింది. హైదరాబాద్‌లో మంచి డాక్టర్లున్నారట. చూపించడానికని ఈరోజు బయలుదేరి వస్తున్నాం" అంటూ తమ్ముడు ఫోన్. నిద్ర కాస్తా ఎగిరిపోయింది.




ఆఫీసుకు శెలవు పెట్టాలంటేనే భయం... సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ నష్టాల ఊబిలో కూరుకు పోయి, ఉన్న ఉద్యోగాలే పీకేస్తూంటే శెలవు పెట్టినా ఇచ్చే పరిస్థితి లేదు. అసలే రోజంతా చేసినా తరగనీ పని. శెలవైన మర్నాడెల్లి రెండ్రోజుల పనీ చేయాలంటే అర్థరాత్రి వరకూ చేసినా తరగని పని. ఈ పరిస్థితులు పెద్దవాళ్లకేమో అర్థంకావు. అర్థమైనా తప్పదుమరి! అమ్మ ట్రీట్‌మెంట్‌కి వస్తోంది. ఇప్పుడేం చేయాలి? ఏమీ తోచడం లేదు. ఆలోచనల్లో తలవేడెక్కి పోతోంది.

ఏమండీ! అంటూ దీనంగా భర్తతో విషయం చెప్పింది. సరే మొన్నటికి మొన్న మా మేనమామనన్నావుగా! ఈ వారం మీ అమ్మ... చేసేదేముంది. అత్తయ్యను హాస్పటల్‌కు తీసుకు వెళ్లాలిగా! మా బాసేమన్నా శెలవిస్తాడేమో అడుగుతాను. రేపు నువ్వు ఆఫీసుకు వెళ్లవు గానిలే! నేను చూసుకొంటాను” ఓదార్పుగా అన్నాడు వినయ్.

విదిత మనసు దిటవు చేసుకుని, ‘థాంక్ గాడ్’ అంటూ మనసులోనే వినయ్‌కి థ్యాంక్స్ చెప్పుకొంటూ “ఇంట్లో సరుకులేమున్నాయో ఏమో చూడాలి” అంటూ వంటింట్లోకి నడిచింది.

వినయ్ మనసులో తనకో బిడ్డకావాలనే తపన ఎక్కువయింది. విదితను ఉద్యోగం మాన్పిస్తేనో! అది అసాధ్యం! ఇద్దరి జీతం కలిస్తేనే నెలొచ్చేసరికి అతికష్టం మీద రెండు వేలు జాగ్రత్త చేయగలుగుతున్నారు. ఆమె ఉద్యోగం మానేస్తే సంసారం గడవడం కష్టం! ఆలోచించసాగాడు.

“విదితగారూ! రేపు మా చింటూ పుట్టిన రోజు. మీరు, మీవారూ రేపు సాయంకాలం

మా ఇంటికి పార్టీకి రండి!" అంటూ ఆహ్వానించింది ఎదురింటి షీలా. "అవునాంటీ! నాబత్‌డే" అంటూ కళ్లు పెద్దవిచేసి ముద్దుగా చెప్పింది స్వీటీ. ఆ చిన్నారి ముద్దు మొహాన్ని చూస్తే ఎవరికైనా ముద్దాడాలనిపిస్తుంది. పాపనెత్తుకొని ముద్దు పెట్టుకొన్నది విదిత. వెళ్లొస్తానండీ! అంటూ వెళ్లిపోయింది షీలా. విదిత మనసులో తమకూ ఓపాప కావాలనే బలమైన కోర్కె కలిగింది.

ఆ రోజు శనివారం ఉదయం పేపరు చదువుతూండగా ఓ ప్రకటన దగ్గర వినయ్ దృష్టి ఆగింది. "మీకు బిడ్డలు కావాలా?" అది కలకత్తాలోని ఓ అనాధాశ్రమ ప్రకటన. రోజుల బిడ్డ నుంచి మూడు సంవత్సరాల పిల్లలవరకూ పెంచుకొనేవారికి బిడ్డను 'దత్తతు' ఇవ్వబడును. "మా నిబంధనలకు బద్ధులై బిడ్డను తీసుకొనవచ్చును". వివరాలకు ఈ క్రింది చిరునామాలో సంప్రదించండి! ప్రకటన చదివి, పేపరు భద్రంగా దాచాడు వినయ్. టిఫిన్ చేసి అత్తగార్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు.

తన మనసులోని ఆలోచనను విదితతో ఎప్పుడెప్పుడు పంచుకొందామా! అని తెగ ఆరాటపడిపోతున్నాడు వినయ్. ఆ మర్నాడు ఆదివారం రానే వచ్చింది. ఉదయం కాఫీలయ్యాక విదిత వాళ్లమ్మ శాంతమ్మ దగ్గర కూర్చుంది. "విదితా! నా ఆరోగ్యం కాస్త కుదుటపడిందిగా. ఈరోజు ఉదయం నేను మనూరికి వెళ్తానమ్మా! వాడికి శెలవైపోయింది. అంటూ విదిత చెయ్యిపట్టుకొని "ఏమ్మా! ఈ అమ్మకు ఓ మనుమడ్నివ్వాలని లేదా? నేను చనిపోయేలోగా ఆ ముచ్చట కూడా తీర్చమ్మా!" అంటూ శాంతమ్మ కంటతడి పెట్టుకొంది. అది సరే... టిఫిన్ తీసుకో అంటూ ఇడ్లీప్లేటు చేతికందించింది విదిత.

టిఫిన్లయ్యాక అత్తగారిని బస్ ఎక్కించి వచ్చాడు వినయ్. ఇంట్లో భద్రంగా దాచిపెట్టిన పేపరుతెచ్చాడు. "విదితా! ఈ ప్రకటన చూడు" అంటూ ఆమె చేతికిచ్చాడు.

"ఇందులో ఏముందండీ! పిల్లలు లేనివారికి పెంచుకోవడానికి పిల్లల్నిస్తారట. అంతేగా!"

"అంతేనా! నువ్వు పెళ్లికి ముందు సమాజసేవ, అనాధ జనోద్ధారణ అంటూ సమాజసేవ చేసేదానివిగా! ఇప్పుడూ అదే చేద్దామంటున్నాను".

"మీరేమంటున్నారో నాకు ఒక్క ముక్కా అర్థం కావడంలేదు".

"అర్థం కాలేదా? నామనసులోని ఆలోచన చెబుతున్నాను విను...

మనం మూడు సంవత్సరాల బాబునో, పాపనో తెచ్చుకొని పెంచుకుందాం. అటు సామాజికపరంగా ఓ అనాధకు మంచి జీవితాన్నిచ్చినట్లూ ఉంటుంది... మూడేళ్ల వయసు కాబట్టి ఆ పాపను డేకేర్ స్కూలుకి పంపించవచ్చు. ఆదివారం సరదాగా బయటకు తీసుకెళ్లవచ్చు. ఏమంటావ్!"

"మీ ఆలోచన అద్భుతమండీ! మనం పాపనే తెచ్చుకొందాం! భవిష్యత్‌లో దేవుడు మేలు చేస్తే మనకో బాబు పుట్టొచ్చు. మనకు పాపపుడితే "విపంచి" అని పేరు పెట్టుకొందామని ఎప్పటినుంచో అనుకొంటున్నానండీ. రేపు వెళ్దాం! ఏమంటారు?"

"అలాగే నీ ఇష్టం! నీకెప్పుడు శెలవు దొరికితే అప్పుడే వెళ్దాం!"

"ఉండండి... ఈ సంతోష సమయంలో మీ కిష్టమైన జీడిపప్పుల సేమియా పాయసం చేస్తాను" అంటూ లోపలికెళ్లింది విదిత. ●